వినూత్నం..సేవాభావం

అభాగ్యులకు అండగా నిలుస్తూ.. సామాజిక సేవలో యువతులు

వయసుకు మించిన మనసుతో వినూత్న ఆలోచనలతో యువత సామాజిక సేవలో భాగస్వామ్యమవుతున్నది. ఓ వైపు తమ బాధ్యత నిర్వర్తిస్తునే మరోవైపు సేవా కార్యక్రమాలపై దృష్టి సారిస్తున్నారు. ఉద్యోగ బాధ్యతలో ఉంటూ.. కూడా సామాజిక సేవలో పాలుపంచుకుంటూ.. అభాగ్యులకు అండగా నిలుస్తున్నారు. దేశ అభివృద్ధికి యువతే కీలకమని చెప్పిన స్వామి వివేకనంద జయంతి సందర్భంగా నగరానికి చెందిన కొందరు యువతుల సామాజిక సేవపై 'నమస్తే' ప్రత్యేక కథనమిది. *-సిటీబ్యూరో, జనవరి 11 (నమస్తే తెలంగాణ)*

30 లక్షల ప్యాకేజీ వదులుకొని...

ఈమె పేరు దుర్గా కల్యాణి. సామాజిక సేవ చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఐటీ రంగంలో కీలక హోదాలో ఉన్న ఆమె సేవా దారిలోకి రావాలనుకున్నారు. స్నేహితుల సహకారంతో ప్రతీ వీకెండ్ నిరుపేద విద్యార్థుల కోసం పుస్తకాలు, బ్యాగులు కొనుగోలు చేసి పంపిణీ చేశారు. అనంతరం ఆ సేవను మరింత మందికి చేర్చాలనే ఉద్దేశంతో జగతి ఫౌండేషన్‌ను స్థాపించారు. చదువులో రాణించే విద్యార్థులకు స్కూల్ ఫీజులు చెల్లించడం, గృహిణిలకు స్వయం ఉపాధిలో భాగంగా కుట్టు మిషన్ శిక్షణ అందించడం.. తదితర సేవా కార్యక్రమాలతో ముందుకు సాగుతున్నారు. అంతేకాదు సేవనే తన లక్ష్యంగా మలుచుకున్నారు. అందుకోసం ఏడాదికి రూ. 30 లక్షల ప్యాకేజీని వదులుకొని పూర్తిగా సేవలో ఉండిపోయారు. భర్త ఉద్యోగి కావడం, స్నేహితులు అండగా నిలవడంతో కల్యాణి సేవకే జై కొట్టారు.

జీతం డబ్బులతో..

ఈమె పేరు పావని. తాను చదువుకునే రోజుల్లో అనేక ఆకలి బాధలను ఓర్చుకున్నారు. ఇప్పుడు ఓ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. తాను చిన్నతనంలో పడ్డ ఆకలి బాధ.. ఇంకెవ్వరిని బాధించొద్దనే ఉద్దేశంతో తన జీతం డబ్బులతో ప్రతీ ఆదివారం అన్నార్తులకు అన్నం పెడుతున్నారు. క్రమం తప్పకుండా ఇప్పటి వరకు 243 ఆదివారాలు అన్నం పెట్టడం విశేషం. ప్రతీ పండుగ రోజుల్లోనూ రోడ్ల వెంట ఉన్న అభాగ్యులకు పండ్లు, ఆహార ప్యాకెట్లు అందిస్తున్నారు.

కంప్యూటర్లు అందిస్తూ..

ఈమె పేరు రినా హిండొక. చిన్నారుల ముఖాల్లో చిరునవ్వులు పూయించేందుకు విభిన్న రకాల సామాజిక కార్యక్రమాలతో ఆదర్శంగా నిలుస్తున్నారు. టచ్ ఏ లైఫ్ ఫౌండేషన్‌తో బస్తీల్లోని నిరుపేద విద్యార్థులకు ఆర్థిక సాయం చేస్తున్నారు. చదువులో రాణించే విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్లు అందిస్తున్నారు. విద్యకు దూరంగా ఉన్న పిల్లలను తిరిగి బడిలో చేర్పించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. తల్లిదండ్రులకు చదువుపై అవగాహన కల్పిస్తున్నారు. బాగా చదువుకున్న వారికి ఉద్యోగ అవకాశాలు సైతం చూపిస్తుండటం విశేషం.

రక్తదానాన్ని ప్రోత్సహిస్తూ.

ఈమె పేరు హర్షిణి. ఫ్యాషన్ రంగానికి చెందిన వ్యక్తి. అనేక సినిమాల్లోనూ మంచి పేరు సంపాదించుకున్నారు. అయితే కేవలం తమ లక్ష్యం కోసమే కాకుండా ఇతరులకు మేలు జరిగేలా కార్యక్రమాలు చేపట్టడం ఇష్టంగా పెట్టుకున్నారు. సమాజంలో నిరాదరణకు గురవుతున్న ఎల్‌జీబీటీక్యూ కమ్యూనిటీకి అండగా ఉన్నారు. ముఖ్యంగా రక్తదాన శిబిరాలను నిర్వహించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ వర్గానికి చెందిన నిరుపేదలకు ఆర్థిక సమస్యలు తీర్చుతూ అండగా నిలుస్తున్నారు.

మేడ్చల్‌లో పౌష్టికాహారం అందేలా చర్యలు

సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ గౌతమ్

సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న జిల్లా కలెక్టర్ గౌతమ్

మేడ్చల్, జనవరి 11(నమస్తే తెలంగాణ): మేడ్చల్ జిల్లా వ్యాప్తంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ అధికారులను ఆదేశించారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులతో కలెక్టర్ గౌతమ్ గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. అంగన్ వాడీ కేంద్రాలను సూపర్‌వైజర్లు, సీడీపీవోలు ఎప్పటికప్పుడు అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి క్షేత్రస్థాయిలో పరిశీలనలు, తనిఖీలు చేపట్టాలన్నారు. శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న కార్యక్రమాలను ఈ సందర్భంగా అధికారులను కలెక్టర్ గౌతమ్ అడిగి తెలుసుకున్నారు. కేంద్రాల్లో అన్ని రకాల వస్తువులు స్టాక్ ఉండేలా చూసుకోవాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ అగ్రస్త, జిల్లా సంక్షేమాధికారి కృష్ణారెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

ప్రపంచ శాంతిని సృష్టించేందుకు శాస్త్రీయతే కొలమానం

సిటీబ్యూరో, జనవరి 11(నమస్తే తెలంగాణ): ప్రపంచ శాంతిని సృష్టించేందుకు శాస్త్రీయతే కొలమానమని హార్వర్డ్ న్యూరో సైంటిస్ట్ డాక్టర్ టోని నాడర్ అన్నారు. హైదరాబాద్ శివారులోని కన్హ శాంతివనంలో గురువారం నిర్వహించిన గ్లోబల్ యూనియన్ ఆఫ్ సైంటిస్ట్స్ ఫర్ పీస్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తక్షణమే ప్రపంచ శాంతిని సృష్టించేందుకు, సానుకూల ప్రభావాలను ఉత్పత్తి చేయడానికి పురాతన వేద శాస్త్రం దోహదపడుతుందన్నారు. స్పృహ ఆధారిత సాంకేతికతను కలిగి ఉన్నట్లు తెలిపారు. అనంతరం పద్మభూషణ్ కమలేశ్ పటేల్ మాట్లాడారు. ఈ సందర్భంగా సమావేశానికి హాజరైన 10 వేల మందికి పొందికైన మెదడు పనితీరును నేరుగా త్రీడీ మ్యాపింగ్ ద్వారా ప్రదర్శించారు.



అడ్వాన్స్‌డ్ ల్యాప్రోస్కోపిక్ ఫెలోషిప్ సదస్సులో పాల్గొన్న ఫాల్స్ కాన్ఫరెన్స్ ఫ్యాకల్టీ సభ్యులు డాక్టర్ గోపీచంద్ మన్నం, మేనేజింగ్ డైరెక్టర్ డా.రమేశ్ గూడిపాటి తదితరులు

టీఎన్జీవో స్పోర్ట్ మీట్ విజేత రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ యూనిట్

జనవరి 24న డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణలో విజేతలకు ట్రోఫీల పంపిణీ: డా. ఎస్ఎం ముజీబ్ హుస్సేనీ

స్పోర్ట్ మీట్ ముగింపు వేడుకల్లో పాల్గొన్న టీఎన్జీవో నేతలు, అధికారులు

సుల్తాన్ బజార్, జనవరి 11: టీఎన్జీవో హైదరాబాద్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో పది రోజులుగా కొన సాగుతున్న యెట్టం సదానంద్ క్రికెట్ మెమోరియల్ 9వ స్పోర్ట్ మీట్ క్రికెట్ టోర్నమెంట్ గురువారంతో ముగిసింది. ఈ మేరకు ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించిన 9వ స్పోర్ట్‌మీట్-2024 క్రికెట్ టోర్నమెంట్ ముగింపు వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు నోడల్ డీఐజీ హైదరాబాద్ సైదిరెడ్డి, నోడల్ డీఐజీ రంగారెడ్డి జిల్లా ట్వింకిల్ జాన్, హైదరాబాద్ సౌత్ డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్ డీవి ప్రసాద్, కమర్షియల్ ట్యాక్స్ గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి దేవేందర్, కమర్షియల్ ట్యాక్స్ ఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షులు ప్రదీప్‌రెడ్డి, కార్యదర్శి రహమత్ అలీ, తెలంగాణ సెక్రటేరియట్ ఫైనాన్స్ సెక్షన్ ఆఫీసర్ రంజిత్‌లు విచ్చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఫైనల్ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన కమర్షియల్ ట్యాక్స్ 15 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 134 పరుగులు చేసింది. అనంతరం, బ్యాటింగ్‌లోకి దిగిన రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ జట్టు మూడు వికెట్లు కోల్పోయి 135 పరుగులు చేసి ఫైనల్ విజేతగా నిలిచింది. 2024 జనవరి 24న టీఎన్జీవో జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ సభలో ఈ క్రికెట్ టోర్నమెంట్‌లో గెలుపొందిన విజేతలకు ట్రోఫీలను అందజేయడం జరుగుతుందన్నారు.

నేడు స్వామి వివేకానంద విగ్రహ ఆవిష్కరణ

సిటీబ్యూరో: కేశవాపూర్ గ్రామ చౌరస్తాలో స్వామి వివేకానంద జయంతి సందర్భంగా నూతన విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు రెడ్డి జాగృతి వ్యవస్థాపక అధ్యక్షుడు మాధవరెడ్డి తెలిపారు. స్వామి వివేకానంద బోధనలు సమాజాన్ని ఎంతో ప్రభావితం చేశాయని, అందుకే ఆయన జయంతి రోజున విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఇదిలా ఉంటే యువజన దినోత్సవాన్ని పురస్కరించుకొని.. వారం రోజులుగా పలు విద్యా సంస్థల్లో సెమినార్లు, వ్యాసరచన పోటీలు, కొన్ని కళాశాల్లో క్రీడా పోటీలు నిర్వహించారు. అందులో గెలుపొందిన వారికి నేడు బహుమతులు అందజేయనున్నారు. నారాయణగూడలోని కేశవ్ మెమోరియల్ విద్యా సంస్థలో నేషనల్ యూత్ ఫెస్టివల్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాట్నా హైకోర్టు విశ్రాంత చీఫ్ జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డి హాజరవుతున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ వాణి వెల్లడించారు. జేబీఎస్ వద్ద వివేకానంద విగ్రహం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు స్వామి వివేకానంద యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రకాశ్‌బాబు, జాయింట్ సెక్రెటరీ మహేశ్ తెలిపారు.

మేడ్చల్ ఓటర్లు 28,50,767

- జిల్లాలో పెరిగిన 31,700 మంది ఓటర్లు
- ఫిబ్రవరి 8న తుది జాబితా విడుదల

మేడ్చల్, జనవరి 11(నమస్తే తెలంగాణ): మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఓటర్ల సంఖ్య మరింత పెరిగింది. ఇటీవల ఎన్నికల సంఘం విడుదల చేసిన జాబితాలో శాసన సభ ఎన్నికలకు ముందు ఉన్న ఓటర్ల సంఖ్య కంటే ఇప్పుడు 31,700 మంది పెరిగారు. మొత్తం 28,50,767 ఉండగా, 18 ఏండ్లు నిండిన వారు ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఈ నెల 21 వరకు అవకాశం కల్పించడంతో ఓటర్ల సంఖ్య మరింతగా పెరిగే అవకాశమున్నది. మార్పులు-చేర్పుల అనంతరం ఫిబ్రవరి 8న ఓటర్ల తుది జాబితాను విడుదల చేయనున్నారు. కాగా, జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లోని 2439 పోలింగ్ కేంద్రాల్లో ఈ నెల 20, 21న అధికారులు ఓటరు నమోదు దరఖాస్తులను స్వీకరించనున్నారు.

వేర్వేరు ఘటనల్లో రెండు బైక్‌లు మాయం

బంజారాహిల్స్, జనవరి 11: గ్యాస్ ఏజెన్సీ బయట పార్క్ చేసిన బైక్ మాయమైంది. ఫిలింనగర్ పోలీసుల కథనం ప్రకారం.. జైహింద్‌నగర్‌లో నివాసి పసుపులేటి యువరాజు కొత్త గ్యాస్ కనెక్షన్ కోసం తెలుసుకునేందుకు ఈ నెల 8న షేక్‌పేట జంక్షన్ వద్ద ఉన్న మాధవి గ్యాస్ ఏజెన్సీకి వచ్చాడు. తన సీబీ షైన్ బైక్‌ను బయట పార్క్ చేసిన అతడు.. కార్యాలయంలోకి వెళ్లి తిరిగి పది నిమిషాల్లో బయటకు వచ్చి చూడగా బైక్ కనిపించలేదు. గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మరో ఘటనలో..

ఫిలింనగర్ పీఎస్ పరిధిలోని ఓ అపార్ట్‌మెంట్ వద్ద పార్క్ చేసిన బైక్ చోరీకి గురైంది. సమతాకాలనీ నివాసి మహ్మద్ ఫర్హాన్ బిన్ ఇషాక్ బుధవారం రాత్రి తన పల్సర్ బైక్‌ను అపార్ట్‌మెంట్ ఎదుట పార్క్ చేశాడు. గురువారం ఉదయం వచ్చి చూడగా బైక్ కనిపించలేదు. ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

వడ్డె ఓబన్న పోరాటం ముందు తరాలకు ఆదర్శం

జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

సిటీబ్యూరో, జనవరి 11(నమస్తే తెలంగాణ): భారత స్వాతంత్ర్య పోరాటంలో వడ్డె ఓబన్న చేసిన వీరోచిత పోరాటం భావి తరాలకు ఆదర్శమని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. ఈ మేరకు గురువారం జిల్లా కలెక్టరేట్‌లో వడ్డె ఓబన్న జయంతి వేడుకలను కలెక్టర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఓబన్న చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓబన్న 1840వ సంవత్సరంలో ఈస్ట్ ఇండియా కంపెనీ ప్రవేశ పెట్టిన భూమి శిస్తు విధానంపై ఉయ్యాల వాడ నరసింహారెడ్డి బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా ఉద్యమాన్ని లేవదీశారన్నారు. అయితే, ఈ ఉద్యమానికి ఓబన్న చిన్న, సన్నకారు, మధ్య తరగతి రైతులతో పాటు సంచార జాతుల వారితో కలిపి సుమారు పదివేల మందిని కూడగట్టి బ్రిటీషర్లకు వ్యతిరేకంగా వీరోచిత పోరాటం చేశారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్, డీఆర్వో వెంకటాచారి, జిల్లా వెనకబడిన తరగతుల సంక్షేమాధికారి ఆశన్న, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రమేష్, సంబంధిత జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వడ్డెరుల అభివృద్ధికి సహకారం

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న చంద్రశేఖర్, ఎండీ శ్రీనివాస్‌రెడ్డి, చైర్మన్ సత్యనారాయణ

చిక్కడపల్లి, జనవరి 11: వడ్డెరుల అభివృద్ధికి ప్రభుత్వం నుంచి తమ వంతు సహకారం అందిస్తామని బీసీ సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ డి.చంద్రశేఖర్, బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గురువారం స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డె ఓబన్న 217 జయంత్యుత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా నిర్వహించింది. వడ్డెర ఆత్మ గౌవర భవన సముదాయ ట్రస్టీ చైర్మన్ జెరిపేట సత్యనారాయణ, వడ్డెర సంఘం గన్ను దెబ్బ అధ్యక్షుడు వేముల వెంకటేశ్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా బీసీ సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ డి.చంద్రశేఖర్, వడ్డెర ఫెడరేషన్ ఎండీ శ్రీనివాస్‌రెడ్డిలు హాజరై వడ్డె ఓబన్న చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వడ్డె ఓబన్న ముని మనవడు మంజుల బాల నర్సింహుడు రచించిన 'వడ్డె ఓబన్న జీవిత చరిత్ర' పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఎత్తిరి అంతయ్య, సంఘాల నాయకులు శివరాత్రి ఐలమల్లు, దుండుగులు రాజ్యలక్ష్మి, ఎత్తిరి మారయ్య, ఓర్సు కృష్ణయ్య, ట్రస్టు డైరెక్టర్లు ఎం.వెంకటేశ్, వల్లెపు వెంకటేశ్, శివ భూపతి, హన్మంతు, యాదయ్య, లింగయ్య, సుధాకర్, వరకుప్పల ముత్యాలు పాల్గొన్నారు.

పట్టుబడిన గంజాయి గ్యాంగ్

వెంగళరావునగర్, జనవరి 11: గంజాయి గ్యాంగ్‌ను ఎస్సార్‌నగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఇన్‌స్పెక్టర్ పీవీ రాంప్రసాదరావు కథనం ప్రకారం.. పశ్చిమ గోదావరి జిల్లా రాయకోడూరు గ్రామానికి చెందిన జీవన్ కుమార్ బాపూనగర్‌లో అద్దెకు ఉంటున్నాడు. మిత్రుడు అశోక్ కూడా అతడితో పాటు ఉండేవాడు. ఈ క్రమంలో తేలిగ్గా డబ్బులు సంపాదించడం, అప్పులు తీర్చడం కోసం గంజాయి వ్యాపారం చేయాలని నిర్ణయించుకున్నారు. మిత్రుడైన సత్యశ్రీ, పవన్‌కు కూడా విషయం చెప్పారు. వీరంతా కలిసి మణితేజ అనే వ్యక్తి నుంచి గంజాయిని కొనుగోలు చేసేవారు. కిలో గంజాయి రూ.20 వేలకు కొనుగోలు చేసి బాపూనగర్‌లోని తమ గదిలో చిన్న చిన్న ప్యాకెట్లుగా తయారు చేసేవారు. వీటిని రూ.500కు ఒకటి చొప్పున అవసరమైన వారికి విక్రయించేవారు. విశ్వసనీయ సమాచారం అందుకున్న పోలీసులు బుధవారం సాయంత్రం ఆకస్మిక దాడి చేశారు. నిందితులు జీవన్‌కుమార్, అశోక్, సత్యశ్రీ, పవన్‌ను అరెస్ట్ చేశారు.

టాయ్ ట్రైన్‌లో ప్రయాణిస్తున్న సీపీ శ్రీనివాస్‌రెడ్డి

నుమాయిష్‌లో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ పోలీస్ స్టాల్

హైదరాబాద్ కీ షాన్ నుమాయిష్

- నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట
- ఎగ్జిబిషన్‌లో పోలీస్ స్టాల్ ప్రారంభం

అబిడ్స్, జనవరి 11: హైదరాబాద్ అంటేనే చార్మినార్, గోల్కొండ, బిర్లా మందిర్, నుమాయిష్ అని నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన(ఎగ్జిబిషన్)లో గురువారం నగర పోలీస్ స్టాల్‌ను పోలీస్ కమిషనర్ ప్రారంభించి తిలకించారు. అనంతరం, జరిగిన సమావేశంలో శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు, మహిళలు, నగర వాసులకు ట్రాఫిక్ రూల్స్, పోలీసు శాఖ నిబంధనలు, షీ టీమ్స్, సైబర్ క్రైమ్స్ వివరాలపై అవగాహన కల్పిస్తామన్నారు. ప్రజల కోసమే ట్రాఫిక్ పోలీస్ స్టాల్‌తో పాటు షీ టీమ్స్, సైబర్ క్రైమ్స్, సెంట్రల్ క్రైమ్స్ స్టాల్స్ కూడా ఏర్పాటు చేశామన్నారు. మహిళలకు సమస్యలు వచ్చినప్పుడు షీ టీమ్స్ ద్వారా వివరిస్తామన్నారు. మహిళలందరికీ షీ టీమ్స్‌పై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఎగ్జిబిషన్‌లో పోలీసులు సందర్శకులకు బందోబస్తుతో పాటు పోలీసు పనితీరును కూడా వివరిస్తున్నామన్నారు. గత సంవత్సరం పోలీస్ స్టాల్‌ను లక్ష 20 వేల మంది సందర్శించారన్నారు. 45 రోజుల పాటు ఎగ్జిబిషన్‌కు ప్రత్యేక బందోబస్తును ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సంవత్సరం పోలీస్ స్టాళ్లను విశాలమైన స్థలంలో కేటాయించడంతో ఎగ్జిబిషన్ సొసైటీకి ఆయన అభినందనలు తెలిపారు. మినీ ట్రైన్‌లో కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డితో పాటు ఇతర పోలీసు అధికారులు ప్రయాణించి..ఎగ్జిబిషన్ నలుమూలలా తిలకించారు. అనంతరం ఔట్ పోస్ట్‌ను సందర్శించారు. కార్యక్రమంలో నగర పోలీస్ జాయింట్ కమిషనర్ విక్రమ్‌సింగ్ మాన్, నగర ట్రాఫిక్ అదనపు కమిషనర్ విశ్వ ప్రసాద్, సీసీఎస్ జాయింట్ కమిషనర్ రంగనాథ్, సెంట్రల్ జోన్ డీసీపీ శరత్‌చంద్ర పవార్, అబిడ్స్ ఏసీపీ ఏ.చంద్రశేఖర్, ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు వనం సత్యేందర్, కార్యదర్శి హన్మంతరావు, కోశాధికారి ఏనుగుల రాజేందర్ కుమార్, ఇతర సభ్యులు పోలీసులు, అధికారులు పాల్గొన్నారు.

టెన్త్ ఉత్తీర్ణత శాతం పెరగాలి

జిల్లా కలెక్టర్ అనుదీప్

సిటీబ్యూరో, జనవరి 11(నమస్తే తెలంగాణ) : పదో తరగతి విద్యార్థుల్లో చాలా మంది గణితం, సైన్స్ సబ్జెక్టుల్లో వెనకబడి ఉంటారని, అలాంటి వారిని గుర్తించి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తే మెరుగైన ఫలితాలు వస్తాయని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సూచించారు. గురువారం జిల్లా సైన్స్ రిసోర్స్ పర్సన్స్‌తో పదో తరగతి పరీక్షలు, ఫలితాలు పెంపు అనే అంశంపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పదిలో ఎక్కువ ఉత్తీర్ణత సాధించేందుకు విద్యార్థులకు అవసరమైన మెళకువలు నేర్పించాలన్నారు. అవసరమైతే ప్రతి రోజు అదనంగా మూడు గంటల పాటు ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు.

మత్తు పదార్థాల కట్టడికి ప్రత్యేక బృందాలు

- కొత్తూరు ఘటనపై దర్యాప్తు ముమ్మరం
- ఏదైనా ఉంటే సమాచారమివ్వండి....
- శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి

సిటీబ్యూరో, జనవరి 11 (నమస్తే తెలంగాణ): కొత్తూరు ఠాణా సాక్షిగా గంజాయి చాక్లెట్లు విక్రయిస్తున్న ఘటనపై పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఇప్పటికే ముగ్గురు ప్రధాన నిందితులను అరెస్టు చేసిన పోలీసులు.. ఇతర ప్రాంతాల్లో ఏమైనా విక్రయాలు జరుగుతున్నాయా.. అనేదానిపై దృష్టి పెట్టారు. స్థానికంగా మరికొన్ని చోట్ల ఈ మత్తు చాక్లెట్ల విక్రయం జరుగుతుందనే వార్తలు వస్తుండటంతో ఆ దిశగా పోలీసులు నిఘా పెట్టారు. ఇందులో భాగంగా అనుమానిత దుకాణాలు, పాన్‌షాపుల్లో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు శంషాబాద్ జోన్ డీసీపీ కె.నారాయణరెడ్డి తెలిపారు. కొత్తూరు పరిసరాల్లోని ఆయా కంపెనీల్లో పనిచేసే కొంత మంది కార్మికులు ఒడిశా, తదితర రాష్ట్రాల నుంచి గంజాయి వంటి మత్తు పదార్థాలతో తయారు చేసిన చాక్లెట్లు, ఇతర పదార్థాలను నగరానికి తీసుకొచ్చి విక్రయిస్తున్నట్లు డీసీపీ వివరించారు. ఈ మేరకు అందిన ఫిర్యాదుతో ప్రధాన నిందితులను ఇప్పటికే అరెస్టు చేశామని, నిందితులచ్చిన సమాచారంతో కేసును మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. మత్తు పదార్థాలకు సంబంధించిన ఏదైనా సమాచారం ఉంటే వెంటనే స్థానిక పోలీసులకు గాని, లేదా 100 నంబర్‌కు గాని సమాచారం ఇవ్వాలని డీసీపీ కోరారు.

సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. మత్తు పదార్థాలు ఆరోగ్యానికే హాని చేయడమే కాకుండా.. సమాజానికి కూడా ప్రమాదకరమన్నారు. గంజాయి, కొకైన్ వంటి మత్తు పదార్థాలు విక్రయిస్తే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల కదలికలను గమనించాలన్నారు. ఎవరైనా మత్తు పదార్థాలు తీసుకున్నా..విక్రయించినా, రవాణా చేసినా జైలు తప్పదని హెచ్చరించారు. ప్రజలు ఇచ్చే సమాచారం ఎన్నో జీవితాలను కాపాడుతుందని డీసీపీ తెలిపారు.

స్టాపులో మార్పులు..

సిటీబ్యూరో, జనవరి 11 (నమస్తే తెలంగాణ) : సంక్రాంతి పండగకు సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికుల కోసం ఉప్పల్ క్రాస్‌రోడ్‌లో బస్సులు నిలిపే స్థలాల్లో మార్పులు చేసినట్లు ఆర్టీసీ ఎండీ సజ్జనార్ తెలిపారు. ఉప్పల్ క్రాస్ రోడ్ నుంచి భువనగిరి, యాదగిరిగుట్ట, మోత్కూర్, తొర్రూరు వైపుగా వెళ్లే బస్సులు లిటిల్ ఫ్లవర్ స్కూల్ సమీపంలోకి మార్చామన్నారు. ప్రతి 300 మీటర్లకు ఒక బస్సు ఉండే విధంగా అక్కడ తాత్కాలిక ఏర్పాట్లు చేశామన్నారు. అలాగే హన్మకొండ వైపుగా వెళ్లే బస్సుల నిలిపే స్థలంలో ఎలాంటి మార్పులు లేవని ఎండీ స్పష్టం చేశారు.

బకాయి చెల్లించమంటే.. చితకబాదారు

ఖైరతాబాద్, జనవరి 11 : కరెంటు బిల్లు ఇచ్చి ఏరియర్స్ చెల్లించమని అడిగినందుకు ఇంటి యజమానులు విద్యుత్ ఆర్టిజన్ కార్మికుడిని చితకబాదారు. ఖైరతాబాద్ సీఐ బాలగోపాల్ తెలిపిన వివరాల ప్రకారం...శ్రీనివాస్ విద్యుత్ సంస్థలో ఆర్టిజన్‌గా పనిచేస్తున్నాడు. గురువారం ఇంటింటికి వెళ్లి బిల్లులను అందజేస్తున్నాడు. ఈ క్రమంలో ఓల్డ్ సీఐబీ క్వార్టర్స్ ఓ ఇంటికి వెళ్లి బిల్లు ఇచ్చాడు. బకాయి ఉంది చెల్లించాలని కోరాడు. అందుకు కోపోద్రుక్తులైన ఇంటి యజమానులు పురుషోత్తం, భాస్కర్ రావు శ్రీనివాస్‌ను తీవ్రంగా కొట్టారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఖైరతాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పండుగకు 4 ప్రత్యేక రైళ్లు

సిటీబ్యూరో, జనవరి 11(నమస్తే తెలంగాణ): సంక్రాంతి పండుగ నేపథ్యంలో సొంతూళ్లకు వెళ్లే రైలు ప్రయాణికుల సంఖ్య పెరుగుతుండటంతో ఆ మేరకు నాలుగు ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేస్తున్నట్టు రైల్వే అధికారులు గురువారం తెలిపారు. ఈ మేరకు సికింద్రాబాద్ - నర్సాపూర్, నర్సాపూర్ - హైదరాబాద్, హైదరాబాద్ - శ్రీకాకుళం రోడ్ రైల్వే స్టేషన్ల మధ్య నాలుగు ప్రత్యేక రైళ్ల రాకపోకలు కొనసాగుతాయన్నారు. ఈ నెల 12 నుంచి 14 వరకు ఇవి నడుస్తాయన్నారు.

గ్యాస్ సిలిండర్ కంపెనీకి నష్ట పరిహారం

నాంపల్లి కోర్టులు, జనవరి 11(నమస్తే తెలంగాణ): గ్యాస్ సిలిండర్ పేలిన ఘటన వల్ల జరిగిన నష్టానికి రేవారి గ్యాస్ సర్వీస్ ఏజెన్సీ ఫిర్యాదుదారుడికి నష్ట పరిహారం చెల్లించాలని హర్యానా వినియోగదారుల కమిషన్ తీర్పు వెల్లడించింది. బెంచ్ అధ్యక్షులు సంజయ్ కుమార్, రాజేంద్రప్రసాద్ (సభ్యులు) సమక్షంలో చేపట్టిన విచారణ ద్వారా